కథ

# అమూల్యం

**డి.కె.చదువులబాబు**



''ఛీ..ఛీ..వెధవ బ్రతుకు. ఢవ కొంప. చస్తే క్షణాల్లో ఈ బాధల ండి విముక్తి దొరుకుతుంది. క్షణం క్షణ నర కయాతన అనుభవిస్తూ, రేపటి ర్చి ఆలోచిస్తూ బ్రతికే బ్రతుకు ఓ తు కేనా? ప్రశాంతత లేని ఈ జీ తం వద్దు..'' శూన్యంలోకి చూస్తూ గ క్కు న్నాడు రవీంద్ర.

రంగారావు, రాజమ్మలకు చిట్టచివరి సంతానం రవీంద్ర. కొడుకు కావాలని వరుసగా ఐదుగురు ఆడపిల్లలకు జన్మనిచ్చారు. బంధువులు, మిత్రులు చెప్పినా వినలేదు.

పిల్లల మంచి చెడ్డలు చూడటం, చదువులు చెప్పించడం, శక్తికి మించిన పనైంది. ముగ్గురు కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేసేసరికి రంగారావు ఆస్తిపాస్తులు ఊడ్చుకుపోయాయి.

రవీంద్ర డిగ్రీదాకా చదివేసరికి గగనమైంది.

నిరంతరం సంసారాన్ని గూర్చి దిగులు- ఈ జన్మ లేకుండేనేం?

చదివింది చాలు. ఏదో పనిచూసుకోమని ఆర్డరేశాడు రంగారావు. కాళ్ళరిగేలా తిరిగినా ఉద్యోగం దొరకలేదు.

ఎందుకూ కొరగానివాడని తల్లిదండ్రులు, మిత్రులు, బంధువులు చిన్నచూపు చూస్తున్నారని గిల్టీగా ఫీలయ్యేవాడు.

కుటుంబాన్ని పోషించటం తనవల్ల కాదు. ఈ జన్మకు ఉద్యోగం రాదు.

రవీంద్ర మెదడును ఆలోచనలు తొలిచేస్తున్నాయి.

అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటింది. నిద్రపట్టడం లేదు.

చావడమెలాగని ఆలోచిస్తున్నాడు. ఒకే ఒక్క గదివున్న ఇల్లు. ఆ ఇంట్లో చావటం సాధ్యం కాదు. లేనిపోని రిస్క్.

ఆలోచించి, ఆలోచించి తెల్లవారుఝాముకు నిర్ణ యానికొచ్చాడు. ఊరి వెలుపల ఉరేసుకోవటం ంరని నిర్ణయించుకున్నాడు.

రక్కున లేచాడు. అమ్మా, నాన్న, అక్కలిద్దరూ ధని ద్రలో వున్నారు. మూలనున్న తాడు నడుమున కొని మెల్లిగా బయటకు నడిచాడు.

గంట తర్వాత ఊరి వెలుపలకు చేరుకున్నాడు పచె ట్టుకు తాడును బిగించాడు.

పక్కనున్న పల్లెనుండి ఓ యువకుడు మూడు కాల బండిలో వస్తూ రవీంద్రను చూసి ఆగాడు.

రవీంద్ర వైపు తాడువైపు మార్చి మార్చి చూసి ''గుడ్ మార్నింగ్ సార్'' అన్నాడు.

''గు..గు..గుడ్‌మార్నింగ్'' తడబడ్డాడు రవీంద్ర.

ఆ యువకుడు రోజూ తనుండే కాలనీలో వారికి పేపర్ అందజేస్తుంటాడు. తెలిసిన ఓ వ్యక్తి తన ఆత్మహత్యా ప్రయత్నాన్ని గుర్తించటం సిగ్గుగా అనిపించింది.

''నాపేరు సిద్ధార్థ సార్. మీపేరు?'' అడిగాడతను.

''రవీంద్ర'' చెప్పాడు.

''ఎందుకు సార్ ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నారు. ఆత్మహత్య మహాపాపం'' అన్నాడు.

రవీంద్ర తన పరిస్థితిని వివరించాడు.

సిద్ధార్థ నవ్వాడు.

''చాలా విచిత్రంగా వుంది సార్. ఉద్యోగం లేదని, బ్రతుకు బరువవుతుందని ఆత్మహత్య చేసుకుంటున్నారా? మీరు భలేవారు సార్. మీలా అనుకుంటే ఈ దేశంలో లక్షలమంది ఆత్మహత్య చేసుకోవాలి సార్''

మౌనంగా తలొంచుకున్నాడు రవీంద్ర.

సిద్ధార్థ నవ్వి క్షణం తర్వాత చెప్పటం ప్రారంభించాడు.

''జీవితాన్ని చూసి అలా బెంబేలుపడితే ఎట్లాసార్? నావైపు చూడండి. చిన్నప్పుడే మా నాన్న చనిపోయారు. ఓ చెల్లెలుంది. అమ్మ కాయకష్టం చేసి మమ్మల్ని పోషించింది. డిగ్రీదాకా చదువుకోగలిగాను. వయస్సు వచ్చాక ఉద్యోగం రాక రిక్షా ఎక్కి సంసార బాధ్యత నెత్తినేసుకున్నాను.

ఓరోజు ఓ తాగుబోతు డ్రైవర్ లారీతో యాక్సిడెంట్ చేశాడు. లారీక్రిందపడి కాలు పోయింది. రోజూ తెల్లారక ముందే లేచి పల్లె నుండి పట్నానికి ఈ చక్రాల బండ్లో వస్తాను. ఇంటింటికీ తిరిగి పేపర్ అందజేస్తాను. తర్వాత స్కూలు పిల్లలకు క్యారియర్‌లు తీసుకెడతాను. ఆ తర్వాత రాత్రి దాకా ఓ బట్టల షాపులో బిల్లులు చెక్‌చేయటం, కష్టమర్స్‌ను ఓ కంట కనిపెట్టుకుని వుండటం చేస్తాను. రాత్రి ఎనిమిది గంటల తర్వాత పల్లెకు వెళ్తాను. పల్లెలో హాయిగా జీవితం జరిగిపోతోంది.''

సిద్ధార్థ మాటలకు ఆశ్చర్యపోయాడు రవీంద్ర. హృదయం వణికింది. దిగ్భ్రాంతుడయ్యాడు.

''ఉదయం నుండి రాత్రి దాకా ఇలా పనిచేయటం కష్టంగా లేదా?'' అడిగాడు.

''కష్టమనుకుంటే ఎలాగవుద్ది సార్! చేజేతులారా విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటామా? నన్ను నమ్ముకున్న నావాళ్ళ పరిస్థితి ఏంటి? కుటుంబం గడవొద్దా? చెల్లెలికి పెళ్ళి చేయాల్సిన బాధ్యత వుంది. దేవుని దయవలన బాగా జరిగిపోతోంది'' చెప్పాడు సిద్ధార్థ.

రవీంద్ర నోట మాట రాలేదు. అన్ని అవయవాలూ సరిగా వుండీ, చదువు, ఆరోగ్యం వున్న తన పరిస్థితి వాడికంటే చాలా ఉన్నతమైంది. తాను బ్రతికి తనవారిని బ్రతికించాలనుకుంటే ఎన్నిదారులు లేవు..తను చనిపోతే తనవారి పరిస్థితి ఏంటి? ఆరుగురు పిల్లలున్నారని నాన్న భయపడి బాధ్యతల నుండి తప్పుకోలేదు. శాయశక్తులా సంసారాన్ని లాగుతూనే వున్నాడు. తనేంటి ఇలా ఆలోచిస్తున్నాడు.

కాలు లేకపోయినా ఆత్మస్థైర్యంతో జీవితరథాన్ని లాగుతూ సంసార బాధ్యతలను భుజస్కంధాలపై మోస్తూ, సమస్యల నధిగమిస్తున్న సిద్ధార్థను చూసి రవీంద్ర సిగ్గుతో కుచించుకుపోయాడు. కొయ్యబారిపోయాడు. నిలువునా చచ్చిపోయాడు. అతని ఆత్మస్థైర్యం ముందు గడ్డిపోచయ్యాడు.

''జీవితం విలువ చావు కాదు. జీవితం ఎంతో విలువైనది. అమూల్యమైనది'' అనుకుంటూ సిద్ధార్థతో కలిసి ఇంటిదారి పట్టాడు రవీంద్ర.

★